క్లుప్తంగా

విద్యార్థులకు ఉపకార వేతనాల పంపిణీ

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థులు ప్రతిభావంతులుగా ఎదిగి, జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని బొందలపాటి మార్కెటింగ్ ప్రైవేటు లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ బొందలపాటి వెంకట ఫణికుమార్ పేర్కొన్నారు. అరండల్‌పేటలోని సంస్థ కార్యాలయంలో సంస్థ 33వ వార్షికోత్సవం సందర్భంగా శనివారం ప్రభుత్వ పాఠశాలల నుంచి టెన్త్ ఫలితాల్లో ప్రతిభ చూపిన 123 మంది విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫణికుమార్ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే స్థిరమైన లక్ష్యంతో చదవాలని సూచించారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు రవితేజ, ఉమాదేవి, సుంకర రామాంజనేయులు, దాడి రామ్ ప్రసాద్, ఎస్. శివనాగేశ్వరరావు, వేల్పూరి మారుతీరాము పాల్గొన్నారు.

29న క్రీడాకారులకు, కోచ్‌లకు ఉచిత వైద్య శిబిరం



గుంటూరు మెడికల్: జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా ఆగస్టు 29న క్రీడాకారులకు, కోచ్‌లకు ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్, స్పోర్ట్స్ ఇంజూరీస్ స్పెషలిస్ట్ డాక్టర్ శివకుమార్ మామిళ్లపల్లి శనివారం తెలిపారు. కొత్తపేటలోని సహస్ర ఆర్థో – న్యూరో సెంటర్ లో ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించనున్న శిబిరాన్ని క్రీడాకారులు, కోచ్‌లు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. క్రీడాకారులకు ఏ చిన్న గాయమైనా అది వారి ఆటతీరుపై ప్రభావితం చూపిస్తుందని, అశ్రద్ధ చేయకుండా వెంటనే వైద్యం చేయించుకోవాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా ఫ్రీ కన్సల్టేషన్ క్యాంపు బ్రోచర్‌ను ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ శివకుమార్ మామిళ్లపల్లి, న్యూరాలజిస్ట్ డాక్టర్ హిమబిందు బొల్లా ఆవిష్కరించారు.

పేద విద్యార్థికి ఆర్థిక సాయం



పాత గుంటూరు: రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు సెంటీనియల్ ఆధ్వర్యంలో పేద విద్యార్థికి శనివారం లక్షన్నర రూపాయల ఆర్థిక సాయం అందించారు. కృష్ణనగర్‌లోని క్లబ్ కార్యాలయంలో నిర్వహించిన సభలో నగరంలోని ప్రైవేటు కళాశాలలో ఇంటర్ చదువుతున్న పేద విద్యార్థి చెన్నం కార్తికేయ ఫీజుకు నగదు చెక్కు అందించారు. వృద్ధాశ్రమానికి బియ్యం పంపిణీ చేశారు. బ్రాడీపేటలోని దివ్యాంగుల పాఠశాల విద్యార్థులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ కొమ్మాలపాటి శ్రీనివాసరావు, గోళ్ల పవన్ కుమార్, లక్ష్మి దంపతులు, సభ్యులు స్రవంతు, వై. అభయ, వై. శ్రీకాంత్. ఈ. రమణబాబు, వీరయ్య, డాక్టర్ రాకేష్, కె.వి. శ్రీనివాస్ పాల్గొన్నారు.

నేడు అడ్వాన్స్‌డ్ కార్డియో వాస్క్యులర్ క్లినిక్ ప్రారంభం



డాక్టర్ విజయ

గుంటూరు మెడికల్: నగర ప్రజలకు అత్యాధునిక కార్పొరేట్ వైద్యసేవలు చేరువ చేయాలనే లక్ష్యంతో లలితా గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఆదివారం అడ్వాన్స్‌డ్ కార్డియో వాస్క్యులర్ క్లినిక్‌ను ప్రారంభిస్తున్నామని మేనేజింగ్ డైరెక్టర్, సీనియర్ న్యూరాలజిస్టు డాక్టర్ పమిడిముక్కల విజయ తెలిపారు. ఉదయం 10 గంటలకు స్థానిక కొత్తపేటలో క్లినిక్ ప్రారంభమవుతోందని చెప్పారు. ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ పోలవరపు అనురాగ్ ఆధ్వర్యంలో అత్యాధునిక కార్డియాలజీ వైద్య సేవలు ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తున్నామని వెల్లడించారు. త్రీడీ క్యాథ్‌ల్యాబ్, హార్ట్ ఫెయిల్యూర్ ఐసీయూ, కరోనరీ కేర్ యూనిట్, కాంప్రహెన్సీవ్ వాస్క్యులర్ సేవలు అందుబాటులో ఉంటాయని ఆమె వివరించారు. నానాటికి పెరిగిపోతున్న క్యాన్సర్‌లను ప్రాథమిక దశలోనే గుర్తించి చికిత్స అందించేందుకు అత్యాధునిక సేవల్ని అందరికీ చేరువ చేయాలనే లక్ష్యంతో ఐరా క్యాన్సర్ సెంటర్‌ను ప్రారంభిస్తున్నామని పేర్కొన్నారు. మెడికల్ అంకాలజిస్ట్ డాక్టర్ బైరపనేని స్రవంతి, సర్జికల్ అంకాలజిస్ట్ డాక్టర్ మోర్ల అయ్యప్ప శ్రీనివాస్ ఆధ్వర్యంలో క్యాన్సర్ సేవలు అందిస్తున్నామని తెలిపారు. కీమో థెరపీ, ఇమ్యూనో థెరపీ, హార్మోన్ థెరపీ, టార్గెటెడ్ థెరపీ, మ్యామో గ్రామ్, కొలనోస్కోపి, బ్రాంకోస్కోపీ, బోన్‌మ్యారో బయాప్సి, ఇతర వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. నగర ప్రజలంతా లలిత గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ అందిస్తున్న వైద్య సేవల్ని వినియోగించుకోవాలని ఆమె కోరారు.

అభాగ్యుల పాలిట దైవం మదర్ థెరిస్సా



మదర్ థెరిస్సా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మద్దు బాలస్వామి



అవగాహన కార్యాలయంలో మాట్లాడుతున్న ఫొటోగ్రాఫర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కృష్ణ

లక్ష్మీపురం: ప్రార్థించే పెదవుల కన్నా సాయం చేసే చేతులు మిన్న.. పేదలు నాకు దేవుడిచ్చిన వరాలు అంటూ జాతిని మేల్కొలిపిన మదర్ థెరిస్సా అభాగ్యుల పాలిట దైవం, మానవతామూర్తి అని ఫొటోగ్రాఫర్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.కృష్ణ పేర్కొన్నారు. అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో కార్యదర్శి కొండా శివ రామిరెడ్డి ఆధ్వర్యంలో శనివారం మదర్ థెరిస్సా జయంతి ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ జీవితం అంతా దీనుల సేవకే అంకితం చేసిన మహనీయురాలు మదర్ థెరిస్సా అని కొనియాడారు. విశ్రాంత రాజనీతి శాస్త్ర శాఖాధిపతి ఎస్. తిరుపతయ్య, సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి మాట్లాడుతూ విశ్వమానవాళిని సొంత బిడ్డల్లాగా చూసిన ఆ మాతృమూర్తికి పేద ప్రజల మీద ఎంతో అభిమానం అన్నారు. అనంతరం సంస్థ సభ్యులు, సీనియర్ సిటిజన్స్, పెన్షనర్స్ అసోసియేషన్ సభ్యులు నివాళులర్పించారు.

మదర్ థెరిస్సా జీవితం ఆదర్శనీయం

నెహ్రూనగర్: అభాగ్యుల సేవలో తరించిన మదర్ థెరిస్సా జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయమని రాష్ట్ర క్రిస్టియన్ మైనార్టీ సెల్ సలహాదారు మద్దు బాలస్వామి పేర్కొన్నారు. మదర్ థెరిస్సా జయంతి సందర్భంగా లక్ష్మీపురంలోని ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బాలస్వామి మాట్లాడుతూ కలకత్తా మురికివాడల్లో పేదలు, నిర్భాగ్యులు, అనాథల్ని చూసి మదర్ థెరిస్సా చలించిపోయి వారికి సేవ చేశారని కొనియాడారు. కుష్ఠు రోగుల్ని సైతం అక్కున చేర్చుకుని వారికి సేవ చేసిన మహనీయురాలు అని కొనియాడారు. సమాజంలోని ప్రతి ఒక్కరూ ఆమెను ఆదర్శంగా తీసుకుని పొరుగువారికి సహాయం చేసే తత్వం అలవరుచుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఫాదర్ కొచ్చర్ల జ్యోతిరాజు, ఫాదర్ షాజన్, ఫాదర్ వినోద్, క్రైస్తవ నాయకులు కర్రా హానోక్ బెంజిమెన్ పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో వేడుకలు

గుంటూరు మెడికల్: జీజీహెచ్‌లోని శుశ్రుత హాలులో శనివారం పంజాబ్ నేషనల్ బ్యాంక్ ఆధ్వర్యంలో మదర్ థెరిసా 133వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ మాట్లాడుతూ పేదలకు సేవ చేయడానికి మదర్ థెరిసా జీవితాన్ని అంకితం చేశారని కొనియాడారు. ఆమె స్ఫూర్తితో వైద్యులు, సిబ్బంది రోగులకు సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో డెప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ డి.ఎస్.ఎస్. శ్రీనివాస ప్రసాద్, సివిల్ సర్జన్ ఆర్ఎంవో డాక్టర్ బత్తుల వెంకటసతీష్ కుమార్, నర్సింగ్ సూపరింటెండెంట్ కె.ఆశా సజని, బ్యాంక్ సీనియర్ మేనజర్ షేక్ గౌస్, న్యూ భారతి ఎక్స్‌రే అధినేత యు. నాగభూషణం, షబానా పాల్గొన్నారు. ముందుగా మదర్ థెరిసా చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

జీజీహెచ్‌లో రూ. 40 లక్షలతో ఐసీయూకి శంకుస్థాపన



భూమిపూజలో పాల్గొన్న డాక్టర్ కిరణ్‌కుమార్

గుంటూరు మెడికల్: జీజీహెచ్‌లో రూ. 40 లక్షలతో స్టెప్ డౌన్ ఐసీయూ నిర్మాణానికి శనివారం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ శంకుస్థాపన చేసి భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పేద రోగులకు కార్పొరేట్ సేవల్ని ఉచితంగా అందించేందుకు ప్రభుత్వ ఆసుపత్రుల్ని కోట్లాది రూపాయలతో ఆధునీకరిస్తున్నట్లు చెప్పారు. ప్రమాదకర పరిస్థితిలో వచ్చిన రోగులకు వెంటిలేటర్లు తప్పనిసరిగా ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజని ప్రోత్సాహంతో పేద రోగుల కోసం నేడు ప్రత్యేక ఐసీయూను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. జీజీహెచ్‌కు వచ్చే రోగులు ఎదురుచూపులు చూడకుండా కొత్తగా నిర్మిస్తున్న ఐసీయూలో ప్రతి బెడ్‌కు వెంటిలేటర్‌ను ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. వైద్య ఆరోగ్య శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ కృష్ణబాబు ఈ ఆసుపత్రి అభివృద్ధి కోసం రూ. 5 కోట్లు కేటాయించారని, అందులో రూ. 40 లక్షల్ని ఐసీయూ కోసం ఖర్చు పెడుతున్నామని తెలిపారు. త్వరితగతిన నిర్మాణం పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. కలెక్టర్ ఎం. వేణుగోపాలరెడ్డి పనుల్ని పర్యవేక్షించేందుకు వస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సివిల్ సర్జన్ ఆర్ఎంవో డాక్టర్ బత్తుల వెంకటసతీష్ కుమార్, డెప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ డి.ఎస్.ఎస్. శ్రీనివాస ప్రసాద్, ఏపీఎంఎస్ఐడీసీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీధర్ ప్రసాద్, డీఈ హనుమంత రావు నాయక్, ఏఈ కె. రత్తయ్య పాల్గొన్నారు.

జీజీహెచ్ సమస్యల పరిష్కారానికి సహకరించాలి

జీజీహెచ్‌లో ఉద్యోగ నియామకాల కోసం డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) కార్యాలయానికి ప్రతిపాదనలు పంపించామని సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ శనివారం రాష్ట్ర ఆర్థిక శాఖ స్పెషల్ సెక్రటరీ కుంభా ఆదినారాయణ దృష్టికి తీసుకెళ్లారు. శనివారం ఆయన జీజీహెచ్‌కు రావడంతో పలు సమస్యల్ని సూపరింటెండెంట్ దృష్టికి తెచ్చారు. ఆసుపత్రిలో నాలుగో తరగతి ఉద్యోగుల పోస్టులను భర్తీ చేసేందుకు అవసరమైన ఫైల్ డీఎంఈ కార్యాలయం నుంచి ఆర్థిక శాఖకు రాగానే గ్రీన్ సిగ్నల్ ఇచ్చే విధంగా కృషి చేయాలని కోరారు. స్పెషల్ సెక్రటరీని కలిసిన వారిలో జీజీహెచ్ అసిస్టెంట్ డైరెక్టర్ చింతలపూడి నాగేశ్వరరావు, అడ్మినిస్ట్రేటర్ బచ్చు ప్రవీణ్ కుమార్ ఉన్నారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

పట్నంబజారు: అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటనపై కేసు నమోదైంది. అరండల్‌పేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ముత్యాలరెడ్డినగర్‌లో నివసించే జి.చంద్రహాసన్ (32) గతంలో పట్టాభిపురం పరిధిలో చికెన్ వ్యాపారం నిర్వహించాడు. అప్పుల పాలయ్యాడు. అవి తీర్చలేక నిత్యం మనస్తాపానికి గురై బాధపడుతుండేవాడు. శనివారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరూలేని సమయంలో ఫ్యానుకు చీరతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మాజీ కార్పొరేటర్ చాంద్ బాషా మృతి



నెహ్రూనగర్: నగరానికి చెందిన మాజీ కార్పొరేటర్ షేక్ చాంద్ బాషా శనివారం మృతి చెందారు. ఆయన కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. అహ్మద్ నగర్‌లోని ఆయన నివాసం వద్ద భౌతికకాయాన్ని నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు సందర్శించి నివాళులర్పించారు. కార్పొరేటర్‌గా షేక్ చాంద్ బాషా డివిజన్ అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారని కొనియాడారు. ఆయన మృతి బాధాకరమని పేర్కొన్నారు.

ఏపీఎన్జీఓ రాష్ట్ర అధ్యక్షుడికి సన్మానం



బండి శ్రీనివాసరావును సన్మానిస్తున్న జిల్లానేతలు

గుంటూరు మెడికల్: ఏపీ ఎన్జీఓ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బండి శ్రీనివాసరావు శనివారం గుంటూరులోని ఏపీఎన్జీఓ హోంకు విచ్చేసిన సందర్భంగా జిల్లా నేతలు ఆయన్ను ఘనంగా సన్మానించారు. మెడికల్ డిపార్టుమెంట్‌ను, 13 ఫైనాన్స్ పీహెచ్‌సీలలో పనిచేసే ఉద్యోగులను 143 బదిలీల నుంచి మినహాయించినందుకు కృతజ్ఞతగా బండి శ్రీనివాసరావుకు సన్మానం చేశారు. ఏఎన్ఎంలకు ఆన్‌లైన్‌లో ట్యాబ్‌లో చేస్తున్న 56 యాప్ లను సగానికి పైగా తగ్గించే ప్రయత్నంలో బండి శ్రీనివాసరావు పాత్రను జిల్లా ఎన్జీఓ నేతలు కొనియాడారు. సచివాలయ ఏఎన్ఎంలను పూర్తిగా పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ పర్యవేక్షణలోకి తీసుకొచ్చినందుకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు నాగూర్ షరీఫ్, జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు, సెక్రటరీ సతీష్‌కుమార్, ట్రెజరర్ శ్రీధర్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీ కూరాకుల శ్రీనివాస్, నగర సెక్రటరీ చింతల కళ్యాణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయ అజ్ఞాని పవన్ కల్యాణ్

మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు గోళ్ల అరుణ్‌కుమార్

నెహ్రూనగర్: పవన్ కల్యాణ్ ఒక రాజకీయ అజ్ఞాని.. ఆయన పార్టీ జనసేన పార్టీ కాదని, కులసేన పార్టీ అని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు గోళ్ల అరుణ్‌కుమార్ మండిపడ్డారు. జెడ్పీ కార్యాలయ ఆవరణలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జనసేన ఏపీలో ఒక సాధారణ రాజకీయ పార్టీ మాత్రమేనని తెలిపారు. దళిత, గిరిజనుల సమస్యలపై కనీసం అవగాహన లేని నాయకుడు పవన్ కల్యాణ్ అని ఎద్దేవా చేశారు. సమస్యలపై వినతి పత్రాలు ఇవ్వడానికి ఆరు నెలలుగా ప్రయత్నిస్తుంటే అపాయింట్‌మెంట్ ఇవ్వకుండా దళిత, గిరిజనుల్ని అవమాన పరుస్తున్నారని మండిపడ్డారు. అధికార పార్టీలో సామాజిక బాధ్యతను గుర్తు చేసే పవన్ మాట్లాడే వేదికపై ఒక్క దళిత, గిరిజన సోదరుడైనా పక్కన ఉంటారా ? అని ప్రశ్నించారు. కొన్ని రాజకీయ పార్టీలు ఇచ్చిన స్క్రిప్టు చదివి వెళ్లడం తప్పా ఆయన వల్ల రాష్ట్రానికి ఎటువంటి ఉపయోగం లేదని ఎద్దేవా చేశారు. టీడీపీ, వైఎస్సార్ సీపీలో సీట్లు దొరకని, ప్రజాదరణ లేని రాజకీయ నిరుద్యోగులు ఆయన పక్కన చేరి దిశ, నిర్దేశం లేని పార్టీగా మార్చారని తెలిపారు. రాష్ట్ర సమస్యలపై ప్రధానితో మాట్లాడతానని చెప్పే పవన్ ముందు ఆయన పార్టీలో విధి విధానాలు ఏంటో ప్రజలకు అర్థమయ్యేలా చెప్పాలని నిలదీశారు. ఇదే వైఖరి కొనసాగిస్తే గత ఎన్నికల్లో రెండు చోట్ల పోటీ చేసి ఓడిపోయినట్లు ఓడిపోతారని తెలిపారు. ఈసారి మూడు చోట్ల పోటీ చేసినా దళిత, గిరిజనులంతా ఏకమై ఓటు హక్కు ద్వారా గెలిచే పరిస్థితి లేకుండా తగిన బుద్ధి చెబుతామని అరుణ్‌కుమార్ హెచ్చరించారు.

వైఎస్సార్ సీపీ జిల్లా ట్రెజరర్‌గా శ్రీనివాసరెడ్డి



పెదకాకాని: వైఎస్సార్ సీపీ గుంటూరు జిల్లా ట్రెజరర్‌గా వెనిగండ్లకు చెందిన కొండమడుగుల శ్రీనివాసరెడ్డి నియమితులైనట్లు ఎంపీపీ తుల్లిమిల్లి శ్రీనివాసరావు శనివారం తెలిపారు. వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు గుంటూరు జిల్లా పార్టీ కమిటీని నియమించారు. శ్రీనివాసరెడ్డి వైఎస్సార్ సీపీ స్థాపించినప్పటి నుంచి పార్టీ అభ్యున్నతికి కృషి చేస్తున్నారు. వెనిగండ్ల గ్రామ సర్పంచిగా పలు అభివృద్ధి పనులు చేసి, ప్రజల మన్ననలు పొందారు. దీనిపై శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ తనకు ఈ పదవి రావడానికి సహకరించిన జిల్లా పార్టీ అధ్యక్షుడు డొక్కా మాణిక్యవరప్రసాద్, స్థానిక ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్యకు కృతజ్ఞతలు తెలిపారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా పనిచేస్తానని ఆయన తెలిపారు.

వీవీఐటీలో నటుడు నవీన్ పొలిశెట్టి సందడి



పెదకాకాని: సినీ నటుడు నవీన్ పోలిశెట్టి వీవీఐటీ కళాశాలలో శనివారం సందడి చేశారు. అను ష్కా శెట్టి, నవీన్ పోలిశెట్టి ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం మిస్ శెట్టి..మిస్టర్ పోలిశెట్టి. సెప్టెంబరు 7న సినిమా విడుదల కానున్న నేపథ్యం ప్రచారంలో భాగంగా నంబూరు వీవీఐటీ కళాశాలను శనివారం చిత్ర బృందం విచ్చేసింది. నవీన్ పోలిశెట్టి మాట్లాడుతూ కృష్ణాష్టమి రోజున సినిమా విడుదల కానున్నట్లు తెలిపారు.

వైభవంగా గంగానమ్మ కొలుపులు



అమ్మవారి పల్లకీ ఊరేగింపులో పాల్గొన్న మంత్రి అంబటి రాంబాబు

పాత గుంటూరు: అరండల్‌పేట రజకుల కాలనీలో గంగానమ్మ తల్లి కొలుపుల్ని శనివారం వైభవంగా నిర్వహించారు. అర్చకుడు కమలాకర శర్మ అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. ఉదయం పెద్దసంఖ్యలో మహిళలు అమ్మవారికి పొంగళ్లు సమర్పించారు. సాయంత్రం రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు, ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం, మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్, మాజీ మేయర్ తాడిశెట్టి మురళి, వైఎస్సార్ సీపీ నాయకులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి పల్లకీ ఊరేగింపులో పాల్గొన్నారు. కార్యక్రమాన్ని ఉత్సవ నిర్వాహకులు వై.వి. సాయి రాఘవ, రజక కాలనీ అధ్యక్షుడు వై. కృష్ణ పర్యవేక్షించారు. ఆదివారం ఉదయం 11 గంటలకు అన్నదానం జరుగుతుందని, భక్తులు పాల్గొనాలని కృష్ణ కోరారు.

రాడీషీటర్లకు కౌన్సెలింగ్



పట్నంబజారు: రౌడీషీటర్లంతా సత్ప్రవర్తన కలిగి ఉండాలని, లేకపోతే నగర బహిష్కరణ తథ్యమని కొత్తపేట పోలీసు స్టేషన్ ఎస్ఐ షేక్ ఎం.డి.మీరజ్ స్పష్టం చేశారు. శనివారం స్టేషన్‌లో రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎస్ఐ మీరజ్ మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు సమాచారం అందితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. రౌడీషీటర్లంతా ప్రవర్తన మార్చుకోవాలని, లేనిపక్షంలో తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు.

అలరించిన సంగీత విభావరి



పాత గుంటూరు: అమరావతి రోడ్డులోని అన్నదాన సమాజం ఆడిటోరియంలో ఆర్ఎస్ ఈవెంట్స్ వ్యవస్థాపకురాలు మునిపల్లె రమణి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన సినీ సంగీత విభావరి ప్రేక్షకుల్ని అలరించింది. సినీ నటుడు చిరంజీవి జన్మదినం పురస్కరించుకుని నిర్వహించిన కార్యక్రమంలో గాయకులు రమణి, పత్రి లలిత్‌బాబు, పాలపర్తి శ్రీనివాసరావు, అరికపూడి సాంబశివరావు, హేమమాలిని పాల్గొన్నారు. చిరంజీవి నటించిన చిత్రాల్లోని పాటలు ఆలపించారు. కార్యక్రమంలో జాస్తి వీరాంజనేయులు, మేకల రవీంద్రబాబు పాల్గొన్నారు.

అప్రమత్తతతోనే వాహనాల ప్రమాదాలు నివారణ



డాక్టర్ కృతికను సత్కరిస్తున్న రంగరాజు, నాగభూషణం తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: వాహనాల్ని నడిపే సమయంలో బాధ్యతాయుతంగా వ్యవహరించడం ద్వారా ప్రమాదాల్ని నివారించగలమని జీజీహెచ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కృతిక నండూరి పేర్కొన్నారు.అమరావతి రోడ్డులోని హిందూ ఫార్మసీ కళాశాలలో శనివారం ఫార్మసీ ప్రాక్టీసు విభాగం, అసోసియేషన్ ఆఫ్ ఓరల్ మక్సిలో ఫేషియల్ సంయుక్తంగా రోడ్డు ప్రమాదాలతో కలిగే ఆరోగ్య సమస్యలు, చికిత్సపై అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ కృతిక మాట్లాడుతూ వాహనాల్ని నడిపే సమయంలో నిర్లక్ష్యం, అతి వేగం ప్రమాదాలకు కారణమవ్వడంతో పాటు పలువురు బాధితులుగా మారుతున్నారని తెలిపారు. డ్రైవింగ్ చేసే సమయంలో హెల్మెట్, సీట్ బెల్టు విధిగా ధరించాలని ఆమె సూచించారు. ప్రమాదాలు జరిగినప్పుడు బాధితులకు అందించాల్సిన ప్రథమ చికిత్సల్ని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. ప్రపంచంలో నిమిషానికి ముగ్గురు రోడ్డు ప్రమాదాల బారిన పడుతున్నారని, వాటిని నివారించేందుకు అవగాహన కార్యక్రమాల్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎట్టిపరిస్థితుల్లోనూ విద్యార్థులు మద్యం, మాదక ద్రవ్యాల వంటి చెడు వ్యసనాల జోలికి వెళ్లరాదని ఆమె సూచించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ జూపూడి రంగరాజు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వి.నాగభూషణం, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె. రవికుమార్, ఫార్మాడీ డైరెక్టర్ పి. సీతారామయ్య, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం

గుంటూరు రూరల్: ఆంధ్రప్రదేశ్ దేశీయ వైద్య సంఘం ఆధ్వర్యంలో నగర శివారులోని శివారెడ్డిపాలెంలోని పోలేరమ్మ దేవస్థానం వద్ద ఆదివారం ఉదయం 8 గంటల నుంచి ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఏపీ దేశీయ వైద్య సంఘం గుంటూరు శాఖ అధ్యక్షుడు నామాల శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ ఆయుర్వేద వైద్యులతో పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమం ప్రారంభోత్సవానికి నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు, డిప్యూటీ మేయర్ వనమా బాల వజ్రబాబు, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్ తదితరులు హాజరు కానున్నట్లు తెలిపారు.

అంకితభావం, పట్టుదలతో కృషి చేస్తే విజయం సాకారం



ప్రొఫెసర్ ఈశ్వర్‌గుప్తాను సన్మానిస్తున్న కళాశాల అధ్యాపకులు

గుంటూరు రూరల్: పట్టుదల, అంకితభావంతో కృషి చేస్తే విజయాలు సులువుగా వరిస్తాయని కర్ణాటక కృపానిధి ఫార్మసీ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ ఎం.ఈశ్వర్‌గుప్తా తెలిపారు. శనివారం నగర శివారులోని లాం నందున్న చలపతి ఫార్మసీ కళాశాలలో విద్యార్థులకు సీక్రెట్ ఆఫ్ సక్సెస్ అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విజయం ప్రతి ఒక్కరి లక్ష్యమని జీవితం సవాళ్లు, అవకాశాలతో నిండి ఉంటుందన్నారు. కష్టపడి పనిచేయాలనే సంకల్పం లేకుండా ఎవరూ విజయాన్ని సాధించలేరన్నారు. విజయాన్ని సాధించాలంటే ముఖ్యమైన విషయం ఓపెన్ మైండ్ కలిగి ఉండాలన్నారు. మూసిన మనసు కలిగినవారు ప్రతి విషయాన్ని అనుమానంతో చూస్తారన్నారు. వారు జీవితంలో ఎదగలేరన్నారు. ప్రతి ఒక్కరూ కష్టపడి విజయ లక్ష్యంతో కృషిచేయాలని సూచించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ నాదెండ్ల రామారావు అతిథిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి



డాక్టర్ పసుపులేటి సురేష్‌బాబును సన్మానిస్తున్న కళాశాల యాజమాన్యం

గుంటూరు రూరల్: పర్యావరణ పరిరక్షణకు విద్యార్థులు పాటుపడాలని శాస్త్రవేత్త డాక్టర్ పసుపులేటి సురేష్‌బాబు అన్నారు. శనివారం చౌడవరంలోని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాలలో పర్యావరణంపై నిర్వహించిన సెమినార్‌లో ఆయన పాల్గొన్నారు. పరిశ్రమల కాలుష్యాన్ని నివారించేందుకు విద్యార్థులు పరిశోధనలు చేయాలని సూచించారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక ప్రకారం వాతావరణ కాలుష్యం వల్ల 23 శాతం మంది ప్రజలు వివిధ అనారోగ్య కారణాల వల్ల మత్యువాత పడుతున్నారని తెలిపారు. ఇంధన రహిత వాహనాలను, వ్యర్థాల రీ–సైక్లింగ్‌తో కాలుష్యాన్ని నియంత్రించవచ్చని పేర్కొన్నారు. కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖలో ఉన్నత పదవి బాధ్యతలు నిర్వర్తిస్తూ, విద్యార్థులకు అతిథి ఉపన్యాసం ఇచ్చిన డాక్టర్ సురేష్ బాబు తమ కళాశాల కెమికల్ విభాగ పూర్వ విద్యార్థి కావడం గర్వకారణమన్నారు. కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ ఆర్.గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్, ప్రిన్సిపల్ డాక్టర్ కె.శ్రీనివాస్, డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, కెమికల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ సీవీ సుబ్రహ్మణ్యం, కో–ఆర్డినేటర్ డాక్టర్ స్వర్ణశ్రీ తదితరులు పాల్గొన్నారు.

శివాలయంలో సహస్ర దీపాలంకరణ సేవ

పెదకాకాని: స్థానిక శివాలయంలో శ్రావణ మాసం పురస్కరించుకుని ఆలయ ప్రాకార మండపంలో రెండవ శుక్రవారం రాత్రి సహస్ర దీపాలంకరణ సేవ ప్రారంభించారు. భక్తులే స్వయంగా దీపాలు వెలిగించి, పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామివారి ఉత్సవమూర్తులకు ఊయల సేవ నిర్వహించారు. అనంతరం స్వామివారి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రథంపై అలంకరించి, ప్రదక్షిణలు చేపట్టారు. ఆలయంలో ప్రతి శుక్రవారం సాయంత్రం సహస్ర దీపాలంకరణ సేవ కొనసాగుతుందని, స్వయంగా భక్తులు పాల్గొని, దీపాలు వెలిగించవచ్చని ఏసీ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి, పాలకవర్గం చైర్మన్ అమ్మిశెట్టి శివశంకరరావు తెలిపారు.